

గుమ్మడిదల తహసీల్దార్ పరమేశంను సన్మానిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

## ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలి

గుమ్మడిదల, ఏప్రిల్10: మండల ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న పరమేశంను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి విన్నవించారు. గురువారం తహసీల్దార్‌ను గోవర్ధన్‌రెడ్డితోపాటు మాజీ సర్పంచ్ దోమడుగు శంకర్, సూర్యనారాయణ, దాసరి ఆంజనేయులు యాదవ్, చిరుమని శ్రీనివాస్, నల్తూరి యాదగిరి, మధు, మ్యాకల రవీందర్, కొత్త కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.



అందోల్: సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

## గ్రామ పంచాయతీకి రూ.5 లక్షల ఆదాయం

అందోల్, ఏప్రిల్ 10: తైబజార్ వేలం పాట ద్వారా గ్రామ పంచాయతీకి రూ.5లక్షల ఆదాయం సమకూరినట్లు పంచాయతీ కార్యదర్శి స్వామి తెలిపారు. శుక్రవారం అధికారుల సమక్షంలో నిర్వహించిన గ్రామసభలో కూరగాయల సంతకు రూ.2లక్షల 50వేలకు సునిల్ అనే వ్యాపారి దక్కించుకోగా....మేకల సంతను రూ.3లక్షలకు ఆశయ్య దక్కించుకున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొని తైబజార్ దక్కించుకున్న వారు ఒకేసారి డబ్బులు కట్టాలని నిబంధన పెట్టగా వ్యాపారులు పూర్తి డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. ఈ డబ్బులను గ్రామాభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు.

## ఆరోగ్యం సరిగా లేక వ్యక్తి ఆత్మహత్య

కోహీర్, ఏప్రిల్10: ఆరోగ్యం సరిగా లేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోహీర్ మండలంలోని కొత్తూర్(కే)లో గురువారం సాయంత్రం చోటుచేసుకొంది. ఎస్సై సతీశ్‌వర్మ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన బేస్త జనార్దన్(58)కు కొంతకాలంగా కడుపు, ఎదలో నొప్పి వస్తున్నది. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గురువారం తన ఇంట్లో ఉరేసుకున్నాడు. అతడి భార్య అనుషమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

అందోల్, ఏప్రిల్ 10: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మంజీరాలో మునిగి వ్యక్తి మృతి చెందినట్లు జోగిపేట ఎస్సై పాండుగౌడ్ గురువారం తెలిపారు. మసాన్‌పల్లికి చెందిన చాకలి శివయ్య(43) బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని మంజీరా నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు గురువారం జోగిపేట పోలీసులుకు ఫిర్యాదు చేశారు. కేసు మోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామ సమీపంలోని నీటిలో ఓ శవం తేలినట్లు తెలియడంతో అక్కడి వెళ్లిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరకొని శివయ్యగా గుర్తించారు. తల్లి భూమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## మైనర్ పెండ్లిపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

కోహీర్, ఏప్రిల్10: మైనర్‌కు వివాహం చేసేందుకు నిశ్చయించిన తల్లిందండ్రులకు గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి, పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. మండలంలోని బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బాలిక(16)కు వచ్చే నెల 11న పెండ్లి చేసేందుకు పెద్దలు నిర్ణయించారు. వివాహ పనులు కూడా ప్రారంభించారు. అమ్మాయి ఇటివల పదో తరగతి వార్షిక పరీక్షలు రాసింది. తల్లిదండ్రులు, పెద్దలు పెండ్లి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుసుకున్న ఐసీడీఎస్, పోలీసులు గ్రామానికి వెళ్లి అమ్మాయి తల్లిదండ్రులను వారి వాహనంలో సంగారెడ్డికి తరలించారు. అక్కడ వారికి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఎవరైనా మైనర్లకు పెండ్లి చేస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

రామచంద్రాపురం, ఏప్రిల్ 10: ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను ఆర్సీపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలోకి వెళ్లితే.. పటాన్‌చెరుకు చెందిన కృష్ణ, చిరంజీవి బీహెచ్ఈఎల్ గ్రౌండ్‌లో బుధవారం రాత్రి ఐపీఎల్ బెట్టింగులను నిర్వహిస్తున్నారు. గ్రౌండ్‌లో బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం రావడంతో ఎస్‌వోటీ పోలీసులు బెట్టింగ్‌లకు పాల్పడుతున్న కృష్ణ, చిరంజీవిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్ద నుంచి రూ.5వేలు నగదు, 2మొబైల్ ఫోన్లు, బ్యాంకులో ఉన్న రూ.2లక్షలు పోలీసులు సీజ్ చేశారు. బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మరో వ్యక్తి రంజిత్‌తోపాటు బెట్టింగ్‌లు, పేకాట నిర్వహించే మరో కీలక సూత్రదారి పరారీలో ఉన్నట్లు తెలుస్తుంది. కృష్ణ, చిరంజీవిపై ఆర్సీపురం పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మిగతా వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## గుమ్మడిదల నాయబ్ తహసీల్దార్‌గా మల్లేశ్

గుమ్మడిదల, ఏప్రిల్10: నాయబ్ తహసీల్దార్‌గా మల్లేశ్ బాధ్యతలు స్వీకరించారు. గుమ్మడిదల తహసీల్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన కరుణాకర్‌రావు ఝురాసంగం మండల నాయబ్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. కంది మండలంలో నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఎస్.మల్లేశ్ గుమ్మడిదల తహసీల్ కార్యాయానికి నాయబ్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.




చోరీ వివరాలు తెలుసుకుంటున్న ఇరిగేషన్ అధికారులు

## మోటర్ పగులగొట్టి కాపర్ వైరు చోరీ

జహీరాబాద్, ఏప్రిల్ 10:న్యాల్‌కల్ మండలంలోని అమీరాబాద్ శివారులోని మంజీరా తీరంలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం పంపుహౌస్ షట్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి మోటర్‌లోని కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల కథనం ప్రకారం.రెండు రోజుల క్రితం ఎత్తిపోతల పథకం పంపుహౌస్‌లోని మోటర్‌ను పగులగొట్టి కాపర్‌వైరు ఎత్తికెళ్లారు. గురువారం సంబంధిత అధికారులకు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో ఇరిగేషన్ ఏఈలు శ్రీధర్, అయ్యూబ్, సిబ్బంది నర్సింహులు, కుతుబోద్దీన్ ఘటనాస్థలాన్ని సందర్శించారు. పంపు సెట్ మోటర్‌లో దొంగలించుకెళ్లిన కాపర్ వైరు విలువ రూ.50వేల వరకు ఉంటుందన్నారు. ఈ విషయమై హద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పరికారలు చోరీ కాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

# జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారం

## హాజరైన మంత్రి దామోదర రాజనరసింహ



ఆత్మ కమిటీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ

చౌటకూర్, ఏప్రిల్ 10: జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ నూతన పాలకవర్గం కొలువుదీరింది. చైర్మన్‌గా మండలంలోని చక్రియాల గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి మల్లారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు మరో 23 మంది సభ్యులుగా ప్రమాణం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైద్యారోగ్య, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్త పాలకవర్గం రైతులకు సలహాలు, సూచనలు చేసి, వారి మన్ననలు పొందాలని సూచించారు. ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానిన్న అందిపుచ్చుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా చైతన్యవంతులుగా చేయాలన్నారు. జిల్లాలో ఆరు ఆత్మ కమిటీలున్నాయని, ఇప్పటి వరకు నాలుగింటికి పాలకవర్గాలను నియమించామన్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్ ఆత్మ కమిటీలను నియమించాల్సి ఉందన్నారు. రూ.170 కోట్లతో సింగూరు కాలువలను ఆధునీకరిస్తున్నామని, త్వరలో సిమెంటు లైనింగ్ పనులు పూర్తి చేయనున్నామన్నారు. ఆత్మకమిటీ వనరులను సమకూర్చుకొని, రైతులకు ఉత్తమ సేవలందించి, మార్గదర్శకులుగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని మంత్రి దామోదర పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, గ్రంథాలయ సంస్థల చైర్మన్లు అంజయ్య, సుహాసిని, దుర్గారెడ్డి, ఈశ్వర్‌గౌడ్, రాజశేఖర్, లక్ష్మణ్, గోవర్ధన్, రాములు, శ్రీహరి, సురేందర్‌గౌడ్, దేవదాస్, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రామాగౌడ్, కైసర్, రమేశ్, అందోలు కృష్ణ, రామచంద్రారెడ్డి, ఉసిక రాంరెడ్డి, బాలగొండ పాల్గొన్నారు.

## మూల్యాంకన భత్యాన్ని రెట్టింపు చేయాలి

రామచంద్రాపురం, ఏప్రిల్ 10: పదోతరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనం భత్యాన్ని, సిబ్బందికి చెల్లించే గౌరవ వేతనాలను ప్రభుత్వం వెంటనే రెట్టింపు చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలీ డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2018లో జీవో 11 ద్వారా స్పాట్ రేట్లు అమలులోకి వచ్చి ఏడేండ్లు గడుస్తున్నా ఇంతవరకు పెంచకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యంగా స్పెషల్ అసిస్టెంట్లకు రోజువారీ గౌరవవేతనం రూ.250 ఉండటం సిగ్గుచేటన్నారు. స్పెషల్ అసిస్టెంట్లకు సైతం రవాణా, దినసరి భత్యం, టీఏ, డీఏ చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా స్పాట్ ముగిసే రోజునే రెమ్యూనరేషన్ నగదు రూపంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## 12నుంచి మల్లికార్జున స్వామి జాతర


పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 10: పటాన్‌చెరు మండలం పాశమైలారంలో ఈనెల 12 నుంచి 15 వరకు భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర నిర్వహిస్తున్నట్టు పాశమైలారం యాదవ, కురమ సంఘం కార్యనిర్వాహక కమిటీ గురువారం ప్రకటనలో తెలిపింది. గ్రామంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరలో 12న శనివారం పాలు పట్టుట, గంగకు పోవుట ఉంటుందని, 13న ఆదివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం ఉంటుందన్నారు. 14న సోమవారం ఒగ్గు కథ,15న మంగళవారం కడపకడగడం ఉంటుందని కమిటీ తెలిపింది. కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు హాజరుకావాలని కోరారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి

## ప్రజా సంక్షేమానికి తోడ్పడాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 10: ప్రజా అవసరాలు తీర్చి వారి సంక్షేమానికి తోడ్పడే విధంగా ప్రభుత్వ పాలసీ ఉండాలని ఐసీఎస్ఎస్ఆర్ సదరన్ రీజినల్ సెంటర్ హానర్ డైరెక్టర్, ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి అన్నారు.'పబ్లిక్ పాలసీని రూపొందించడంలో సామాజిక శాస్త్రాల పాత్ర-బహుళ విభాగ దృక్పథం' అనే అంశంపై రెండు రోజులుగా తారా ప్రభుత్వ కళాశాలలో జరిగిన జాతీయ సెమినార్ గురువారం ముగిసింది. వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశోధకులు టెక్నికల్ సెషన్‌లో తమ పరిశోధన పత్రాల ద్వారా పబ్లిక్ పాలసీ ఏ విధంగా ఉండాలి, పాలసీ రూపకల్పనలో సామాజిక శాస్త్రాల పాత్ర ఏమిటీ, అభివృద్ధికి, పబ్లిక్ పాలసీకి మధ్య వైరుధ్యాలు ఏవిధంగా ఉన్నాయి, వాటి మధ్య ఉన్న అంతరాలను తొలిగించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై చర్చించారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టు మానవుడికి సంబంధించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ గోపీనాథ్‌రెడ్డి, ప్రొఫెసర్ రాములు, అబ్దుల్ కలాం ఆజాద్ జాతీయ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ కామ్రుద్దీ, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రత్న ప్రసాద్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ మల్లిక, డైరెక్టర్ డాక్టర్ జగదీశ్వర్, కో కన్వీనర్ డాక్టర్ జోత్స్న, కార్యదర్శి డాక్టర్ అనురాధ, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




సిద్దేశ్వరానందగిరి మహారాజ్‌కు సన్మానిస్తున్న ఆలయకమిటీ

## వీరభద్రశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన

ఝరాసంగం, ఏప్రిల్ 10: హిందూ ధర్మ రక్షణకు ఆలయాలు నిలయాలని, వాటి పరిరక్షణ మనందరిపై ఉంటుందని బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి, మహా మండలేశ్వర సిద్దేశ్వరానందగిరి మహారాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కక్కరవాడలో నూతనంగా నిర్మించిన భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ హన్మంత్‌రావు పాటిల్, కేతకీ ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


## తహసీల్ కార్యాలయం తనిఖీ

సంగారెడ్డి, ఏప్రిల్ 10: తహసీల్ కార్యాలయానికి వచ్చే బాధితులు, అర్జీదారులకు అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంగా ఉండాలని ఆర్డీవో రవీందర్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని తహసీల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మట్టి అక్రమ తరలింపుపై రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదుపై స్పందించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా కార్యాలయానికి వచ్చే ప్రతిఒక్కరికీ జవాబుదారీతనంగా ఉండాలన్నారు. భూ సమస్యలు, ధృవ పత్రాల జారీలో అలసత్వం వహించొద్దని నాయబ్ తాసీల్దార్ నగేశ్‌ను ఆదేశించారు. ఆర్డీవో వెంట తాసీల్దార్ దేవదాస్, ఆర్ఐ, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

# అభ్యంతరాలు తెలియజేయాలి



గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న శ్యామ్‌పిస్టన్స్ అండ్ రింగ్స్ పరిశ్రమ కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నేతలు

గుమ్మడిదల, ఏప్రిల్ 10:ప్యారానగర్ డంపింగ్ యార్డుపై చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అభ్యంతరాలు తెలియజేయాలని జీపీ కార్యాలయంలో నోటీసులు అతికించారని జేఏసీ నాయకులు తెలిపారు. దీనికి స్పందిస్తూ గుమ్మడిదల రైతు జేఏసీ నాయకులు డంపింగ్ యార్డుకు సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలందరూ కలిసి డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ) వద్దని తహసీల్ కార్యాలయంలో అభ్యంతరాల పత్రాలను అందజేద్దామని నిర్ణయించారు. గురువారం గుమ్మడిదల మున్సిపాలిటీలో 65వ రోజు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో బొంతపల్లి పారిశ్రామికవాడలోని శ్యామ్‌పిస్టన్స్ అండ్ రింగ్స్ లిమిటెడ్ పరిశ్రమకు చెందిన కార్మికులు లక్ష్మీనారాయణ, సీతారాం, శ్రీను, తవిటి నాయుడు, సత్యనారాయణ, దేవుళ్లు, వెంకట్‌నాయుడు, రామకృష్ణ, జగన్‌మోహన్ పాల్గొన్నారు. వీరికి గుమ్మడిదల రైతు జేఏసీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చిన్నపాపని కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు చిమ్ముల నర్సింహారెడ్డి, రాజశేఖర్, ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ హుస్సేన్, బాల్‌రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రిలే నిరాహారదీక్షలు చేశారు. ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్షలో నల్లవల్లి జేఏసీ నాయకులు కూడా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన గుమ్మడిదల తహసీల్ కార్యాలయంలో, నల్లవల్లి గ్రామ పంచాయతీలో డంపింగ్‌యార్డు(ఎంఎస్‌బ్ల్యూ)పై అభ్యంతరాలు తెలియజేయాలని నోటీస్‌లు అందజేశారు. దీనికి స్పందించిన నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల ప్రజలందరూ కలిసి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డంపింగ్‌యార్డు వద్దని అభ్యంతరాల పత్రాలను అందజేస్తామని తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంతోపాటు అన్ని గ్రామాల ప్రజలు కూడా తర్వాత రోజు డంపింగ్ యార్డు వద్దని అభ్యంతరాలు తెలియజేయనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల ప్రజలు డంపింగ్‌యార్డు వద్దని అభ్యంతరాలను అందజేయడం వల్ల డంపింగ్ యార్డు అనుమతులు ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.




సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 10: తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో చలివేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వచ్చే సందర్శకుల దాహార్తి తీరేందుకు చలివేంద్ర దోహదపడుతుందన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, ట్రెసా అధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి కిరణ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఏఐతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు కంప్యూటర్లు అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 10: కృత్రిమ మేధాతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హత్నూర అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు కలెక్టర్ కంప్యూటర్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కృత్రిమ మేధా ఏఐ ఆధారిత విద్యాబోధన అన్ని పాఠశాలల్లో ప్రారంభించాలనే ఉద్దేశంతో జిల్లాలోని విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న 15 పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో ఏఐ విస్తరింపజేసే క్రమంలో వారికి ప్రత్యేకంగా కంప్యూటర్లు అందిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో కృత్రి మేధ ఆధారిత ఏఐ కార్యక్రమాన్ని 33 పాఠశాలల్లో గతనెల 15న ప్రారంభించామని గుర్తు చేశారు. జూనియర్ కళాశాల విభాగంలో హత్నూర అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు 10 కంప్యూటర్లను అందజేసి అక్కడ జేఈఈ మెయిన్స్ ఎంసెట్ కోచింగ్ పూర్తి స్థాయిలో నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారినికి కంట్రోల్ రూమ్**

కలెక్టరేట్‌లో వివిధ సంక్షేమ పథకాల సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఎల్ఆర్ఎస్, రాజీవ్ యువ వికాసం పథకం, తాగునీటి ఎద్దడి నివారణ కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా గ్రీవెన్స్ సెల్ 08455-276155 నెంబరుకు డయల్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యాలయ పనివేళల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు జలాలు

పుల్కల్, ఏప్రిల్10: సింగూరు ప్రాజెక్టు నుంచి మెదక్ జిల్లా ఘనపూర్ ఆయకట్టుకు జల విద్యుత్ కేంద్రం ద్వారా గురువారం అధికారులు నీటిని విడుదల చేశారు. 5 విడుతల్లో భాగంగా సింగూరు ప్రాజెక్టు నుంచి ఘనపూర్ ఆయకట్టుకు 1400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917టీఎంసీలకు ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వ 19.977 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. నీరు దిగువకు వదులుతున్న కారణంగా మత్స్యకారులు, గొల్లకాపరులు నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లొదని వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలన్నారు.



సింగూరు ప్రాజెక్టు నుంచి వెళ్తున్న నీరు



అందోల్: మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

## కనులపండువగా శివపార్వతుల కల్యాణం

అందోల్, ఏప్రిల్ 10: జోగిపేట జోగినాథ స్వామి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూడు రోజులుగా రథోత్సవం, ఎడ్లబండ్ల ఊరేగింపు, అగ్నిగుండాలు తదితర పూజలు నిర్వహించగా...గురువారం శివపార్వతుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో కల్యాణం ఘనంగా సాగగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణంలో వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్ షెట్కార్ పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి పార్వతీపరమేశ్వరుల తలంబ్రాలు అందజేశారు. శాలువాతో సన్మానం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జోగినాథ స్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ మార్కుఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి సునీల్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లయ్య, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



అమీన్‌పూర్ సర్వేనంబర్ 993లో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు

# అక్రమ కట్టడాల కూల్చివేత

అమీన్‌పూర్,ఏప్రిల్ 10: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనంబర్ 993 ప్రభుత్వ స్థలంలో రాత్రికి రాత్రే అక్రమ కట్టడాలు నిర్మించడంతో గురువారం తహసీల్దార్ వెంకటస్వామి జేసీబీలతో కూల్చివేతలకు పూనుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఎక్కడైనా అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేతలతోపాటు చట్టపమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు అందితే కూల్చివేతలు మాత్రం తప్పవని గుర్తు చేశారు. అమీన్‌పూర్‌లో ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నా డేగ కన్ను వలే కాపాడుకుంటామన్నారు.

## వైభవంగా సీతారాముల రథోత్సవం

జిన్నారం, ఏప్రిల్ 10: మంగంపేటలో సీతారాముల రథోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల ఉత్సవమూర్తులను రథంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర యువత నాయకుడు వెంకటేశం గౌడ్ ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో సీతారాముల రథోత్సవం వైభవంగా సాగింది. దారి పొడవునా భక్తులు, మహిళలు సీతారాములకు నీరాజనం పట్టారు. అనంతరం ముఖ్యఅతిథులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రాజేశ్, ప్రభాకర్ రెడ్డి, నక్క నాగరాజు, ఆంజనేయులు, శ్రీకాంత్ గౌడ్, మంద రమేశ్, కృష్ణ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




రథోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు



అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాస్

## అంగన్‌వాడీ కేంద్రలను సద్వినియోగం చేసుకోవాలి

రాయికోడ్, ఏప్రిల్ 10: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని మొదటి అంగన్‌వాడీ కేంద్రం టీచర్ సక్కుబాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రతి చిన్నారుల తల్లిందండ్రులు తమ పిల్లలను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రంలోనే చేర్పించాలన్నారు. అనవసరంగా చిన్నారులను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి ఆర్థికంగా ఇబ్బందులకు గురికావద్దన్నారు. అనంతరం చిన్నారులకు వార్షిక పత్రాలు అందజేశారు. చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. సమావేశంలో పంచాయతీ కార్యాదర్శి శివశంకర్, టీచర్లు సక్కుబాయి, లలిత, విజయకుమారి, ఆయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.



అంగన్‌వాడీలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించిన టీచర్లు

## వార్షికోత్సవాలు నిర్వహించడం అభినందనీయం

సంగారెడ్డి, ఏప్రిల్ 10: ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని, మాజీ కౌన్సిలర్ నాయికోటి రమేశ్ అన్నారు.గురువారం పట్టణంలోని శ్రీనగర్, కిందిబజార్ అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల్లో వార్షికోత్సవాలు నిర్వహించడం గొప్ప విషమన్నారు. ఈ వేడుకల్లో చిన్నారులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయన్నారు. చిన్నారుల తల్లిదండ్రులతోపాటు ప్రజలు పాల్గొని విజయవంతం చేశారన్నారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రమోట్ అయి పాఠశాల వెళ్లే చిన్నారులకు ప్రశంసాపత్రాలతోపాటు సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరసమ్మ, పద్మ, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.